# తనదాకావస్తే...?

రచన :
అకుండి నారాయణమూర్తి



తుపాను భయంకరంగావుంది. మెరుపులు, ఉరుములు, అంధకారం, విశృంఖలంగా వీస్తున్న గాలుల శబ్దం, పొంగి పారలుతూ హోరున ఘోష పెడుతున్న నది, ఏకధారగా వర్షం అంతా ప్రళయకాల రుద్రతాండవంలా గుందారాత్రి. ఆరాత్రి ఆ ఊరంతా ఆ నదిలో కొట్టుకుపోతుందేమోనని భయమేసింది అనంతానికి.

తలుపు తెఱచి ఓమారు ప్రకృతి భయంకర స్వరూపాన్ని ఆ అర్ధరాత్రప్పుడు చూద్దామని బుద్ధిపుట్టిందతనికి. అంతవరకూ వెచ్చగా రగ్గు కప్పుకొని పడుకున్న అనంతం మెల్లగాలేచి వీధి తలుపు తెఱచేడు. జోరుగా గాలి, వర్షపుజల్లు, చెట్లఆకులూ, చెత్తా లోనికి జొరబడింది. ఇంతసేపటిలోనే అతనుతొడుక్కున్న బట్టలముందు భాగం పూర్తిగా తడిసిపోయింది. గదిలో గోడకు తగిలించివున్నదీపం ఆరిపోయింది. అంతా అంధకారం! ఆ ఘోర అంధకారంలో కళ్ళుచించుకొని చూచినా ఏమీ అగుపించలేదు. కంటికేమీ అగుపించకపోయినా అతని శ్రవణేంద్రియాలకు మాత్రం ఓ బీభత్సమయిన స్వరం ఆ ప్రళయఘోష మధ్యనుంచి భయంకరంగా వినిపించింది. అతని శరీరం భయంతో కంపించింది. గబుక్కున తలుపువేసేసి లోపలకొచ్చి నిశ్చింతగా పడుకొనివున్న భార్యనులేపి, "చూడు సుశీలా! అవతల ఎవళ్ళో ఏడుస్తున్నట్లుంది" అన్నాడు.

"అబ్బ! ఇపుడెందుకా గొడవ! పడుక్కుందురూ!" అంటూ కళ్ళు నులుపుకుంటూ లేచి "అరె! దీపం ఆరిపోయిందే!" అని పరుపుక్రిందవున్న అగ్గిపెట్టె తీసి ఆ అంధకారంలో తడువుకుంటూ దీపంవేపు అడుగువేసింది.

అనంతం అంతటితో ఊరుకోలేదు. "అదికాదు సుశీ! పాపం, ఆ పిచ్చిది చచ్చిపోయుంటుందేమో! ఆ చిన్నపిల్ల ఏడుపులాగే ఉందాశబ్దం. పాపం దాని భర్త ఉన్నాడన్నమాటేగానీ ఏంలాభం? వాడికి రోజురోజుకీ ఆ చలి జ్వరం వచ్చేస్తూవుంటుంది. పాపం, ఈ అర్ధరాత్రప్పుడు ఈ ప్రళయంలో..."

అర్ధోక్తియందే సుశీల అందుకొని—
"చస్తే పీడాబోయింది! 'అది త్వరలో చస్తేనే నయం' అన్నాడీమధ్య దాని మొగుడు అసిరిగాడు. ఆ పిచ్చిది బ్రతికుండి వాళ్ళకేం లాభం చెప్పండి?

అ పిచ్చిదానికి చాకిరీ చెయ్యలేక చస్తున్నారు అపిల్లా వాడున్నూ. అదిచచ్చిందని విచారించేవాళ్ళెవరూలేరు. ఇంతకీ అర్ధరాత్రప్పుడు ఈ ప్రళయఘోషలో మీరేందుకావిషయం గురించి ఆలోచించడం? హాయిగా రగ్గుకప్పుకొని పడుక్కోండి!" అంది దీపం వెలిగిస్తూ.

"అదికాదు నేనిప్పుడనేది. అది చనిపోయిందని నేనిప్పు డంతగా బాధపడలేదు. తలుపుతీసి అపిల్లఏడుపోమాటు విను. ఎంత దీనంగా ఏడుస్తున్నాదో తెలుసా? మనందరి దృష్టిలోనూ అది పిచ్చిదే అవొచ్చు. కాని వచ్చీ రాని జ్ఞానంతోవున్న అ ఎనిమిదేళ్లపిల్ల దృష్టిలో దానితల్లి పిచ్చిదిగా అగుపించదు. ఎంత పిచ్చిదైనా కని పాలిచ్చి పెంచిందిగా. అదికూడా ఒక మాతృశ్రీయే. ఈప్రళయఘోషలో అ దీనార్తనాదాలు మనలాంటి డబ్బున్నవాళ్ళకు వినిపించవులే. వాళ్ళు అపూటకు తిండిలేని కటికదరిద్రులవడంచేత వాళ్ళు చచ్చినాసరే చూచి, మిగతా ఆ కుటుంబీకులని ఓదార్చడానికైనా ఎవ్వరూ వెళ్ళనిచ్చగించరు. వాళ్లకష్టాలు ఆఖరికి కాటిలోనే తీరుతాయి. అదే మనలాంటి ఓ ధనవంతులమనిషయ్యిందంటే, అఖరికదో కుష్ఠురోగయినా ఇంత ప్రళయంలోనూ చాలామంది వాళ్ళను వారించడానికి వెళ్ళేవారేమో? ఏమంటావు సుశీ!"

"చాల్లెద్దురూ? మహా కరుణా సముద్రుడిలా కబుర్లు చెపుతున్నారు. అంతలా బీదలనే అభిమానం ఉన్నట్లయితే వాళ్లని నెత్తికెక్కించుకొని పోషించండి. పిచ్చివాళ్ళనీ, రోగిష్టులనీ ఇంకా రకరకాల అపసంది వెధవలనందరినీ పోషించండి!"

"నేననేది అదిగాదు! నేనూ స్వార్థపరుణ్ణే! ఎంత స్వార్థపరత్వం ఉన్నా, డబ్బుందని ఎంత అహంభావం వున్నా, ఇలాంటి కష్టసమయంలో కనీసం వాళ్లనోదార్చడం తోటిమానవులయిన మన విధేమోనని!"

"హుఁ! ఏడిసినట్టేవుందిలెండి! బ్రతికున్నప్పుడు వాళ్లమీదలేని దయాభిమానాలు చచ్చిన తరువాత వాళ్ళమీద చూపెడితే ప్రయోజనమేమిటండీ? మరేం కొంప మునిగిపోయింది లేదు. ఒకవేళ ఆ పిచ్చిది చచ్చున్నట్లయితే తెల్లారుజామున శవాన్ని ఏట్లోపారేస్తారు! ఈ వానలో ఆ పాపిష్టిముండను దహనపరచడంకూడానా?" అంది సుశీల.

కొంచెమైనా జాలనేది లేకుండా అతితేలిగ్గా పేలుతున్న సుశీలను చూచేసరికి అనంతానికి ఒళ్ళు మండింది. "నీది కర్కశహృదయం! మానవత్వం నీలోలేదు. ఒకవేళ నేనే ఈ అర్ధరాత్రప్పుడు ఏకారణంచేతయినా చచ్చినప్పుడు, కనీసం ఓదార్చడానికయినా ఏ ఒకరూ రాకపోతే అప్పుడాబాధ అర్థమౌతుంది నీకు" అన్నాడు.

అవాక్యం వినంగానే సుశీలలో నవనాడులూ కంపించిపోయేయి. కెవ్వన కేకేసి అనంతాన్ని గట్టిగా కౌగలించుకుంది. "అవేం మాటలు పోనిస్తురూ!" అంది బొంగురుపోయిన గొంతుకతో.

"అంతపని జరక్కపోయినా ఆ దృశ్యం తలుచుకొనేసరికే బెంబేలెత్తిపోతున్నావు. అలాంటప్పుడు ఈ భయంకర ప్రళయంలో ఆ చిన్ని గుడిసెలో అన్నట్లు పాపం వాళ్ళంటున్న చిన్న గుడిసె ఈపాటికి మచ్చుకికూడా లేకుండాపోయుంటుంది! ఎలాగున్నారో ఏమిటో!"

"అబ్బ! మీకెందుకండీ ఇప్పుడా గొడవంతాను? తెల్లారేక చూద్దాంలెండి! పడుక్కోండురూ బాబూ!" అంది విసుగెత్తి.

"నాకు మరి నిద్దరపట్టేట్టులేదు!— ఏదీ నా టార్చిలైటోమారిలా యియ్యి! నేవెళ్ళి చూసొస్తాను. అవసరమయితే మన కంచారిగాడిని పిలిచి వాళ్ళదగ్గర కావుంచుతాను. పాపం, పదేళ్లయినా నిండని ఆ అమాయక పిల్ల ఎలాగుందో ఏమిటో!"

"లైటూలేదు గియిటూలేదు పడుక్కోండి!" అంది కొంచెం చిరాకుతో.

"సరే, నేనే తీసుకుంటాను" అంటూ ప్రక్కమీంచి లేచి అలమరవేపు అడుగులేసేడు.

"ఏమండోయ్! మీకే చెప్పేది. ఈ ప్రళయంలో మీరెక్కడికీ వెళ్ళొద్దు."

"మరేం ఫరవాలేదులే! నువ్వు రగ్గు కప్పుకొని హాయిగా పడుక్కో" అంటూ అలమరలోంచి టార్చిలైటు తీసి వీధి తలుపువేపు అడుగులేసేడు.

సుశీల గబుక్కున మంచంమీంచి దిగి "మీరెళితే నాకు భయంగా ఉంటుందండీ!" అంది అతని భుజాన్ని పట్టుకొని.

అనంతం మరేమీ అనలేదు. నవ్వుతూ తలుపుతీసేడు. జోరుగా వర్షపు జల్లు గాలిలోనికి కొట్టింది. ఆ గాలితోపాటు "బాబూ!" అంటూ కాళ్ళమీద పడిందో మానవజీవి! గదిలోని దీపం ఆరిపోయింది.

త్రుళ్ళిపడ్డారిద్దరూ! టార్చిలైటువెలిగించేడనంతం. ఎవరు? పాపం! ఆ పిల్లే!! లేవనెత్తేడు. గజగజా వణికిపోతున్నాది పాపం. "ఏం? ఏం జరిగింది" అనడిగేడు. అపిల్ల వెంటనే జవాబేమీ చెప్పలేకపోయింది. "మరేం భయం లేదు చెప్పన్నా"డు అనంతం.

"ఏటిసెప్పేది బాబయ్యా! మా అమ్మ సచ్చిపో...నా...ది! మా అయ్యకు సాయంత్రమే ఎప్పటి...నా...గ జొరం వచ్చేసి...నా...ది. మూలుగుతూ ఆ గోడవేర తొంగున్నాడు. ఇందాకేసిన

పెద్దగాలికి ఆగోడ మా అయ్యా మీద కూ...లి...పో...నా...ది. నా ఏడుపు ఎవురింటారు బాబయ్యా!..." అంటూ అనంతం కాళ్ళను పట్టుకొని వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టింది.

అనంతం హృదయం ద్రవించిపోయింది. ఆ అంధకారంలో అతని కళ్లంట కారిన కన్నీరును ఎవ్వరూ గుర్తించివుండరు. "అయ్యో! నువ్వు ఇక్కడేవుండు. మన్ను తీసేస్తే బ్రతుకుతాడేమో!" అంటూ దుస్సహమయిన ఆ తుపానులో ధారాపాతంగా కురుస్తున్న వర్షంలో ఒక్కొక్క గాలివిసురుకూ మహావృక్షాలు కూకటివ్రేళ్ళతో కూలిపోతూవుంటే ఆ అంధకారంలో గుడిసెవేపు అడుగులేసేడు అనంతం.

"అయ్యో! మీరెందుకెళతారండీ? పెరటివీధిలో మన కంబారిల్లు ఉంది కదండీ! వాణ్ణిపిలుస్తానుండండీ!" అని కేకవేసింది సుశీల ఆందోళనతో.

అనంతం ఆమెకే సమాధానం ఇవ్వలేదు.

సుశీల కంబారిని వెంటబెట్టుకొని శిథిలమయిన గుడిసెదగ్గరకు వచ్చింది. టార్చిలైటు వెలిగించి చూచింది. "ఏవండోయ్! ఎక్కడ!" అని కేకేసింది గట్టిగా. సమాధానంరాలేదు. "ఎక్కడికెళ్ళేరమ్మా?" అని అడిగేడు కంబారి.

ఒక భయంకరమగు సుదీర్ఘమైన మెరపుతో ఒక ఉరుము ఉరిమింది. సుశీల కెవ్వున కేకేసి "అదిగో బాబుగారిపాదాలు! గోడ మీద పడిపోయింది. అయ్యో! నా కేం దారి! అయ్యో తియ్యండి బాబోయ్!" అంటూ గట్టిగా ఏడుపు మొదలెట్టింది

చాలామంది ఆ గోలకు లేచేరు. అనంతం పంతులుగారిమీద గోడ పడిందని తెలియంగానే అంత ప్రళయంలోనూ చాలామంది ఆ వీధివాళ్ళు పరిగెత్తుకుంటూ వచ్చేరు.

అనంతంతోపాటు ఆ మిగతా నిర్భాగ్యుల్నీ తీసేరు బయటకు.

డాక్టరొచ్చేడు. ఓ రెండు మాత్రం శవాలని నిశ్చయపరచేడు.

అనంతానికి కొంతసేపటికి కొంచెం తెలివివచ్చింది. మెల్లిగా కళ్ళు విప్పి "ఆ...పి...ల్ల ఏదీ?... ఇదేమిటి ఇంత మంది మూ...గే...రు? ఓహో నేను ధనవంతుణ్ణికదా! ఆ పిల్లా..." అని గొణిగి సగంలోనే ఆపేసేడు వాక్యాన్ని. డాక్టరు మళ్ళీ ఇంజక్షన్ ఇచ్చేడు.

సుశీల చైతన్యవిహీనంగా నిలబడింది భర్త వేపుచూస్తూ! 'అంతా సమయానికి రాబట్టిగానీ లేకపోతే ఏమయేదో' అనుకుందామె.

అలానే తన తండ్రిమీదా గోడపడిన వెంటనే అంతావచ్చి తీసినట్లయితే బ్రతికేవాడేమోనని ఆపిల్ల అనుకుంటున్నట్లు సుశీలకు తెలీదు.

## * తెలుగు మంత్రులు *

రచన: "హరహర"

*

కరువులతో రాయలసీమ
బరువుగ నూరెను గరిమ
పర్యటనలు చేసే మంత్రులు
ఆపలేరు దుఃఖస్రవంతులు
తీర్చలేరు ఆకలిని; కన్నీ
ర్గార్చలేరు ప్రజలకొరకు!

మొక్కుల మున్షిమంత్రికి
ఎక్కలేదు ఆ గంజి
డోకులు వచ్చెను పాపం
ఏ కలిమాయో మరి అది!

ప్రజలందరికి గంజే
సజలముగ ఇస్తారే
ఇస్తామని అంటారే
పస్తులు లేవంటారే
సిగ్గులేద చెప్పకొనగ
ఉగ్గుబాల విద్యయేనా!

మీదు గురువు రాజాజీ
పాదుకల ప్రభావమేనా
పూటకుపూటకు వేషం
పాటకు పాటకు తాళం
అందుకొనగ మీదు గురువు
దండాలుగలచేయిగదా!

సన్యాలవండనుచు
ఉపన్యాసాలిస్తారా?
ఫస్టుక్లాసు ప్రయాణాలు
సుష్టుగాను చేస్తారా?

పోలీసుల కంత ఖర్చు
సాలీసా ఏలనండి?
విద్యకొరకు చేయుఖర్చు
సద్వినియోగం కాదా!

ఎలక్షన్ల పరీక్షలకు
పర్యటనలు ఎందుకండి?
పర్యవసానం తెలిన
దుర్వ్యయమాయెను అంతా!

కరువుబాధ నివారణకు
అరుదుగ చేసే పనులలో
దోపిడి కంట్రాక్టర్లను
రూపుమాపివేయలేరా?

కృష్ణవేణి తరలింపుకు
తృష్ణలు మీకేలనోయ్?
మంత్రులు ఆసీసువారు
కంత్రీలైనారు మీరు!

యదార్థాలు వినిపించవు!
పదార్థాలు కనిపించవు!
కన్నీరే కారదు మీకు!
మీరంతా తెలుగుమంత్రులు!